7

సాక్షి చిత్తూరు

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



చిత్తశుద్ధితో పరిష్కరించండి

సమస్యల పరిష్కారం కోసం విన్నవించే ప్రజలకు చిత్తశుద్ధితో పని చేసి పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. - 8లో



తమిళ బియ్యం పట్టివేత

కర్ణాటకకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన తమిళ రేషన్ బియ్యాన్ని నిందితులను ఆ రాష్ట్ర పోలీసులు కుప్పంలో పట్టుకున్నారు. - 8లో



కరణంవారిపల్లెలో హైనా?

చిరుతపులి సంచరించినట్లు చెప్పడంతో ఫారెస్టు అధికారులు చౌడేపల్లి మండలంకరణం వారిపల్లెలో పర్యటించారు. - 8లో

న్యూస్‌రీల్

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

చిత్తూరు రూరల్: చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీఐఓ హనుమంతరావు తెలిపారు. చిత్తూరు నగరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. చంటి బిడ్డలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. నిర్ణీత సమయంలో టీకాలు వేయిస్తే..అంటువ్యాధులు, ఇతరత్రా వ్యాధులు దరి చేరవన్నారు. టీకాకు దూరంగా ఉన్న పిల్లలను ఇంటింటి సర్వే ద్వారా గుర్తించాలన్నారు. త్వరలో జరిగే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో వారికి తప్పక టీకాలు వేయించాలని ఆయన ఆదేశించారు.

పోలీసు కార్యాలయంలో నేడు గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడవచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

ఏఓగా ప్రసన్నాంజనేయులు



చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ట్రాన్స్‌కో కార్యాలయం అకౌంట్స్ ఆఫీసర్ (ఏఓ)గా ప్రసన్నాంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయం ఏఓగా ఉన్న ఆయన చిత్తూరు జిల్లా కార్యాలయానికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు తీసుకున్న ఆయన వెళ్లి ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఈలు సురేష్, మునిచంద్ర, ఏఏఓ గీత, సిబ్బంది ఏఓకు స్వాగతం పలికారు.

పరిహారం పెంపు

చిత్తూరు కార్పొరేషన్: వన్యప్రాణుల దాడిలో పంట నష్టం, ప్రాణాలు కోల్పోయిన వారికి పరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గత సంవత్సరం చివరన జిల్లా అటవీశాఖాధికారులు పరిహారం పెంచాలని నివేదిక పెట్టారు. వాటికి ప్రభుత్వం స్పందించింది. వన్యప్రాణుల దాడిలో మరణిస్తే గతంలో ఇస్తున్న రూ.5 లక్షలను రూ.10 లక్షలకు పెంచారు. గాయపడిన వారికి ఇస్తున్న రూ.75 వేల పరిహారాన్ని రూ.2 లక్షలకు పెంచారు. పాడి, చెరుకు పంటలు నష్టపోతే ఎకరానికి రూ.6 వేలు ఉండగా రూ.12 వేలకు, మామిడి, కొబ్బరి చెట్లకు రూ.1500 నుంచి రూ.2 వేలకు పెంచారు.

27న ఉచిత డీఎస్సీ శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

నగరి : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, అమరావతి నుంచి వెలువడిన ఉత్తర్వుల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా సంక్షేమ, సాధికారి అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరిగే డీఎస్సీలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల నిమిత్తం అభ్యర్థులకు ఉచిత బోధన, ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో మూడు నెలల శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 27వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో అర్హులైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తామని తెలిపారు.

10 రోజుల్లో పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డ్రిప్ పరికరాల మంజూరుకు 10 రోజుల్లో ప్రాథమిక తనిఖీ పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఆయన సోమవారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 26,193.36 హెక్టార్లకు 25,972 మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో 8,306.09 హెక్టార్ల ప్రాథమిక తనిఖీ పూర్తి చేశారన్నారు. పరిపాలన అనుమతులతో 1,193 మంది రైతులకు మైక్రో ఇరిగేషన్ పరికరాలను అందజేశామన్నారు. బిల్ ప్రక్రియ పూర్తయిన 7,912 మంది రైతులకు వారి వాటా చెల్లించేలా మెసేజ్ పంపించారన్నారు. పరికరాలు అవసరమైన రైతులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. సమావేశంలో జేసీ విద్యాధరి, ఏపీ ఎంఐపీ అధికారులు మధుసూదన్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పైసా కొట్టు.. పట్టా పట్టు

తిలా పాపం.. తలా పిడికెడు అన్న చందాన చిత్తూరు జిల్లాలో ఓపెన్ స్కూల్ దందా సాగుతోంది. అనివార్య కారణాలతో మధ్యలో చదువు మానేసిన వారు టెన్త్, ఇంటర్‌ను దూరవిద్య విధానంలో పూర్తి చేసుకునేందుకు ఏపీ ఓపెన్ స్కూల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే ప్రైవేట్ స్టడీ సెంటర్ల నిర్వాహకులు మాత్రం అడ్మిషన్ల కోసం వచ్చే అభ్యర్థుల నుంచి పాస్ గ్యారెంటీ స్కీం పేరిట అందినకాడికి దండుకుంటున్నారు. ఈ తతంగం విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ నోరు మెదపడం లేదు. అందుకు ప్రతిఫలంగా ప్రైవేట్ స్టడీ సెంటర్ల యాజమాన్యాలు ముడుపులు చెల్లిస్తున్న తతంగం జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది.




చిత్తూరు జిల్లా కేంద్రంలోని ఓపెన్ స్కూల్ కార్యాలయం





- చిత్తూరు జిల్లాలో 69 ప్రభుత్వ, ప్రైవేట్ స్టడీ సెంటర్లు
- ఏటా వేల సంఖ్యలో అడ్మిషన్లు
- పాస్ గ్యారెంటీ అంటూ దోచుకుంటున్న ప్రైవేట్ స్టడీ సెంటర్ల నిర్వాహకులు
- ఫీజుల దోపిడీ నియంత్రణకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో తప్పుడు నివేదికలతో ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్న వైనం
- గుర్తింపు లేని కేంద్రాల్లోనూ అడ్మిషన్లు
- చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పంలో అధికంగా ఫీజుల వసూళ్లు
- విషయం తెలిసినా పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ స్కూళ్లు, కళాశాలలతో పాటు ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో ఏపీ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని నిరక్షరాస్యులు, ఉద్యోగోన్నతి అవసరమైన ఉద్యోగులు పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులను దూరవిద్యలో చేసేందుకు ప్రైవేట్ స్టడీ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న ప్రైవేట్ స్టడీ సెంటర్ల నిర్వాహకులు అభ్యర్థుల నుంచి వేల కొద్దీ ఫీజులు వసూలు చేస్తున్నారు.



పాస్ గ్యారెంటీ స్కీంకు ఒక రేటు, తరగతులకు రాకపోతే మరొక రేటు, చూసిరాతలకు ఇంకో రేటు ఇలా అందినకాటికి దండుకుంటున్నారు. దీంతో నిరక్షరాస్యుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆశయం నీరుగారుతోంది. చిత్తూరు జిల్లాలో ఓపెన్‌గానే దందా సాగుతోంది.

ప్రత్యేక తరగతుల ఊసే లేదు

ఓపెన్ స్కూల్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫోకస్ పెట్టారు. స్టడీ సెంటర్ల నిర్వాహకుల పెత్తనాన్ని తగ్గించేలా ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చారు. పాఠ్య పుస్తకాలను సకాలంలో నేరుగా విద్యార్థుల ఇళ్లకే పోస్ట్ ద్వారా పంపించి, తరగతుల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. కానీ ఈ ఏడాది తరగతుల నిర్వహణ సవ్యంగా సాగడం లేదు. 2024–25 విద్యా సంవత్సరానికి సార్వత్రిక విద్యావిధానంలో పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. పలు దఫాలు గడువు పెంచిన అధికారులు చివరి అవకాశం అంటూ ఈ నెల 25 వరకు ప్రవేశాలు పొందవచ్చని ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. షెడ్యూల్ మేరకు 30 తరగతులు నిర్వహించాలి. ఇప్పటికే చేరిన వారిని పరీక్షలకు సన్నద్ధం చేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కానీ ప్రత్యేక తరగతులు నిర్వహించకుండానే ప్రత్యేకంగా లెక్చరర్లను నియమించుకున్నట్లు, తరగతులు నిర్వహిస్తున్నట్లు తప్పుడు నివేదికలు సృష్టించి ప్రభుత్వం నుంచి వచ్చే రెమ్యునరేషన్, తరగతుల నిర్వహణ నగదును దోచుకుంటున్నారు.

పర్యవేక్షణ తూచ్..

ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి లేరు. గతంలో జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కేడర్ అధికారి ప్రత్యేకంగా ఉండేవారు. అయితే ప్రస్తుతం డీఈఓ కార్యాలయంలో ఉండే పదో తరగతి పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కేడర్ అధికారికి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. అయితే పరీక్షల విభాగానికి అసిస్టెంట్ కమిషనర్ లేకపోవడంతో డీఈఓ కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ (ఏడీ–1) బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ అధికారికి కార్యాలయానికి సంబంధించిన పనులే తలకు మించిన భారంగా ఉండడంతో ఓపెన్‌స్కూల్ సొసైటీకి సంబంధించి క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడుతోంది.

నెరవేరని ఓపెన్ స్కూల్ ఆశయం..

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఓపెన్ స్కూల్ సొసైటీని ప్రారంభించారు. అనివార్య కారణాలతో చదువులు మధ్యలోనే ఆపేసిన వారు 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. గుర్తింపు పొందిన స్టడీ సెంటర్ల ద్వారా ఏటా ప్రవేశాలు కల్పించి వార్షిక పరీక్షలు నిర్వహిస్తోంది. రెగ్యులర్ కోర్సులతో సమాన గుర్తింపు ఉండడంతో ఓపెన్ విధానంలో టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. చిత్తూరు జిల్లాలో మొత్తం 69 స్టడీసెంటర్లు ఉన్నాయి. వీటిలో ఏటా ఏడు వేలకు పైగా అభ్యర్థులు అడ్మిషన్లు పొందుతున్నారు.

అధికంగా పరీక్ష ఫీజులు వసూళ్లు..

ఓపెన్ స్కూల్స్‌లో ఇంటర్మీడియెట్ జనరల్ కేటగిరీ వారైతే రూ.1,400, రిజర్వేషన్ అభ్యర్థులు రూ.1,100 ఫీజు చెల్లించాలి. పదో తరగతి జనరల్ వారికి రూ.1,300, రిజర్వేషన్ ఉన్న వారు రూ.900 చెల్లించాల్సి ఉంటుంది. ప్రవేశం పొందే అభ్యర్థులు నేరుగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వివిధ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులు ఈ కోర్సుల్లో ఎక్కువగా చేరుతున్నారు. దీంతో కొన్ని ప్రైవేట్ స్టడీ సెంటర్ల నిర్వాహకులకు పాస్ గ్యారెంటీ పేరుతో నిర్దేశిత ఫీజు కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పంలో అధికంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.

ప్రైవేట్ స్టడీ సెంటర్లలోనే..



ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ స్టడీ సెంటర్లలో అధికంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. కట్టడి చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రైవేట్ స్టడీ సెంటర్లలోనే అధికంగా దోపిడీ సాగుతోంది. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు సైతం తెలుసు. వారు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని గతంలో మా సంఘం తరఫున అధికారులకు తెలియజేశాం. నిరసనలు సైతం చేపట్టాం. అయినప్పటికీ ఏ మాత్రం మార్పులేదు.

– ప్రవీణ్,
ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం, జిల్లా కార్యదర్శి

పోలీసుల త్యాగాలు మరువలేనివి

- వారు లేని సమాజాన్ని ఊహించలేం
- అమరులైన పోలీసులకు ఘన నివాళులు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు



అమర వీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ




అమర వీరులకు నివాళులర్పిస్తున్న జిల్లా జడ్జి, మేయర్, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ

చిత్తూరు అర్బన్: ప్రజల మాన, ప్రాణ, ఆస్తులను కాపాడంతో పాటు సమాజం ప్రశాంతంగా ఉండడానికి ప్రతీ పోలీసు మేల్కొని ఉండడమేనని అధికారులు స్పష్టం చేశారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించడం కూడా సాధ్యం కాదని, వారి త్యాగాలకు మనం ఎంత చేసినా తక్కువేన్నారు. చిత్తూరులోని ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో సోమవార పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని.. అమరవీరుల స్థూపానికి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు, మేయర్ అముద, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నాయుడు, ఎస్పీ మణికంఠ చందోలు తదితరులు నివాళులర్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు మాట్లాడుతూ ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా ముందు వరసలో నిలబడి తానున్నానే భరోసా ఇచ్చేది పోలీసులే అన్నారు. ఒక్కోసారి దురదృష్టవశాత్తు విధుల్లో ఊహించని ఘటనలు ఎదురైనపుడు ప్రాణాలు కూడా విడిచే పరిస్థితి ఉందని, అలాంటి వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పోలీసుల ధైర్య సాహసాలను గుర్తు చేసుకుంటూ, సమాజానికి వాళ్లు చేస్తున్న సేవలను స్మరించుకోవడమే పోలీసులకు ఇస్తున్న గౌరవమన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులకు అప్రమత్తత ప్రధానమన్నారు. పోలీసుల సేవలకు ప్రత్యామ్నాయం చూపించలేమన్నారు. అమరవీరుల త్యాగాలు ప్రతీ ఒక్కరిలో స్ఫూర్తి నింపాలని, విధి నిర్వహణలో నిస్వార్థంగా సేవలు అందించి, ధైర్యసాహసాలతో ప్రజల గుండెల్లో ఉండాలన్నారు. అనంతరం అమరులైన పోలీసులను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు టి.సాయినాథ్, ప్రభాకర్, పార్థసారథి, ఇలియాజ్ బాష, మహబూబ్ బాష, పోలీసు సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

‘కిక్కు’ కోసం కూటమి..!

- పూతలపట్టులో మద్యం దుకాణంపై కుట్ర
- షాపు దక్కించుకున్న వ్యక్తికి బెదిరింపులు
- ఓ షాపును బలవంతంగా లాక్కున్న నేతలు



సాక్షి టాస్క్‌ఫోర్స్: అడ్డగోలుగా మద్యం షాపులు దక్కించుకోవడానికి కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారు. బలవంతంగా షాపులను లాక్కొంటున్నారు. లక్కీ డిప్‌లో మద్యం షాపు దక్కించుకున్న వ్యక్తిపై పూతలపట్టులో బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో చేతిలోని డబ్బులు పోగొట్టుకొని.. షాపులు దక్కించుకున్న వ్యక్తులు లబోదిబోమంటున్నారు. పూతలపట్టు మండల కేంద్రంలో మూడు షాపులకు అనుమతులున్నాయి. ఇందులో షాపును దక్కించుకున్న వ్యక్తికి కూటమి నేతల నుంచి బెదిరింపులు మొదలయ్యాయి.

దొర.. తగునా?

పూతలపట్టు మండలంలో మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తిని ఆరంభం నుంచి కూటమి నేతలు వెంబడించారు. ఆ వ్యక్తి వెనుక ఎవరెవరున్నారో విషయంపై ఆరా తీశారు. అతను రాజకీయ పలుకుబడి లేని వ్యక్తిగా గుర్తించారు. అతన్ని భయభ్రాంతులకు గురి చేశారు. కార్లల్లో వెంబడించి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అసభ్య పదజాలంతో దూషించారు. చివరకు కుటుంబాన్ని కూడా లాగారు. దీంతో భయభ్రాంతులకు గురైన వ్యక్తి నుంచి మార్గం సుగమం చేసుకుని అడ్డగోలుగా మండలంలో షాపును ప్రారంభించేశారు. ఇదంతా మండలంలో కీలకంగా వ్యవహరించే ఓ నేత నడిపించారని తెలుస్తోంది. ఓ ప్రజాప్రతినిధి కన్నుసన్నల్లో జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. శాఖ అధికారులు దీనిపై చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే టీడీపీ అధినేత ఆదేశాలకు విరుద్ధంగా మండల కేంద్రంలోని వ్యవహరించడంపై టీడీపీ నాయకులు కొంతమంది భగ్గుమంటున్నారు. కాగా షాపు దక్కించుకున్న వ్యక్తికి రక్షణ లేకుండా పోవడంతో ముందడుగు వేయలేకపోతున్నారు.

ముగిసిన టెట్



డీవైఈఓ చంద్రశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో, తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన టెట్ పరీక్షలు సోమవారంతో ముగిశాయని డీవైఈఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెట్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించామన్నారు. ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను నిత్యం తనిఖీ చేసినట్లు చెప్పారు.

కంటైనర్ డిపో ఏర్పాటు చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో కంటైనర్ డిపో ఏర్పాటు చేయాలని జిల్లా పండ్ల పరిశ్రమ సమాఖ్య కార్యదర్శి కట్టమంచి బాబి కోరారు. ఈ మేరకు ఆ సమాఖ్య నాయకులు సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పండ్ల పరిశ్రమల నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వచ్చే సీజన్‌లో రైతులకు ఇవ్వాల్సిన గిట్టుబాటు ధరపై ముందస్తుగా తీసుకునే చర్యలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని హామీ ఇచ్చారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

– జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో అందించే మౌలానా అబుల్ కలాం పురస్కారాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో పలు అంశాలు వెల్లడించారు. ఏటా నవంబర్ 11వ తేదీన భారత మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ జయంతిని పురస్కరించుకుని మైనారిటీ దినోత్సవం ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ఈ ఏడాదిలో నిర్వహించే వేడుకల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం, డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం అందజేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి చెందిన ఉర్దూ సాహితీవేత్తలు, స్కాలర్, కవులు, పాత్రికేయులు, విమర్శ, పరిశోధన, గద్య బోధన, ఉర్దూ సేవకులకు ఆరుగురికి పురస్కారాలు అందిస్తారన్నారు. జీవితకాల సాఫల్య పురస్కారం ఇస్తారని తెలిపారు. ఎంపికయ్యే వారికి రూ.1,25 లక్షలతో పాటు, సర్టిఫికెట్, మెమెంటో అందిస్తారన్నారు. దక్షిణ భారత దేశానికి సేవలందించిన డాక్టర్ అబ్దుల్ హఖ్ పురస్కారానికి రూ.1 లక్ష నగదు ప్రోత్సాహం, సర్టిఫికెట్, మెమెంటో ప్రదానం చేస్తారన్నారు. ప్రతి జిల్లాలో ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులు, ముగ్గురు ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు ఇస్తారన్నారు. ఇందుకు అర్హత, ఆసక్తి కలిగిన వారు ఉర్దూ అకాడమీ జారీ చేసే దరఖాస్తు ఫారం పూర్తి చేసి సంబంధిత పత్రాలను జతచేసి ఈ నెల 25 లోపు డా.మహమ్మద్ మస్తాన్ డైరెక్టర్, సెక్రటరీ, ఏపీ ఉర్దూ అకాడమీ, డోర్ నంబర్ 76–1–6ఏ/1, 2, మాలవిక విల్లా, హెచ్‌బీ కాలనీ, భవానిపురం, విజయవాడ–520011 అనే చిరునామాకు పోస్టు, కొరియర్‌లో పంపాలని కోరారు.

25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అర్హత, ఆసక్తి ఉన్న కోచింగ్ సెంటర్లు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి కోరారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ నిర్వహణలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఎస్టీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే అభ్యర్థులకు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలను మూడు నెలలపాటు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందేందుకు టెట్ అర్హత కలిగిన అభ్యర్థుల కుటుంబ ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలన్నారు. అలాగే శిక్షణ ఇచ్చేందుకు ఎంప్యానెల్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణా సంస్థలు కచ్చితంగా నిబంధనలు కలిగి ఉండాలన్నారు. కనీసం రెండు డీఎస్సీలకు శిక్షణ ఇచ్చి ఉండాలని, కనీసం 100 మంది టీచర్లుగా ఉద్యోగాలు పొంది ఉండాలన్నారు. మూడేళ్ల సరాసరి టర్నోవర్ కనీసం రూ.40 లక్షల వరకు ఉన్న సంస్థలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు www.jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని డీడీ వెల్లడించారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం సమాచారం
వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల
కోసం సంప్రదించండి.



మీ ఉన్నతికై శ్రమించిన
ఆత్మీయుల జ్ఞాపకాలు,
నివాళులు
బంధుమిత్రులకు మరియు
శ్రేయోభిలాషులకు
సమాచారం
తెలియజేసే అవకాశం.

సాక్షి దినపత్రికలో అంతిమయాత్ర, శ్రద్ధాంజలి, వర్ధంతి, జ్ఞాపకార్థం తదితర ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో వున్నారు.

SAKSHI
99122 20586, 97054 44179
Mail id: tptadvtsakshi@gmail.com

క్లుప్తంగా

స్వర్ణోత్సవ మహాసభలకు ఆహ్వానం


కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: స్వర్ణోత్సవ మహాసభలకు విచ్చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి యూనియన్ నేతలు సోమవారం కలెక్టరేట్‌లో ఆహ్వానపత్రిక అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని పూతలపట్టులో నవంబర్ 3, 4 తేదీల్లో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో టీచర్ల సమస్యలు, అపార్ ప్రక్రియలో ఎదుర్కొంటున్న టెక్నికల్ ఇబ్బందులు, తదితర సమస్యలను క్షుణ్ణంగా చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి విద్యా సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప, సరిత తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

చిత్తూరు రూరల్: మైనర్ బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి న్యాయం చేశారని టీడీపీ బీసీ సెల్ నాయకుడు షణ్ముగం తెలిపారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. శాంతిపురం మండలం కురబ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక గర్భవతి అయిందన్నారు. బిడ్డకు కడుపునొప్పి అని తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్తే 8 నెలల గర్భవతిని తేలిందన్నారు. దీంతో పోలీసులను ఆశ్రయించగా పోక్సో చట్టం కింద యువకుడిపై కేసు నమోదు చేయడంతో పాటు బాలిక కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు అధికారులు సహకరించారని ఆయన తెలిపారు.

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించండి

- ప్రజలను పదేపదే తిప్పించుకోవద్దు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వివిధ శాఖలకు సంబంధించి 176 అర్జీలు నమోదు

చిత్తూరు కలెక్టరేట్ : సమస్యల పరిష్కారం కోసం విచ్చేసే ప్రజలకు చిత్తశుద్ధితో పని చేసి పెట్టాలని, పదే పదే వారిని తిప్పించుకోవద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. బాధ్యతగా ప్రజలకు సమాధానాలు ఇవ్వాలని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 176 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

176 అర్జీల నమోదు..

జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించి 176 అర్జీలు నమోదయ్యాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 151, జిల్లా విద్యాశాఖ 1, పోలీస్ శాఖ 4, జిల్లా వైద్య, ఆరోగ్య విభాగం 1, డీఆర్‌డీఏ 9, డీసీహెచ్‌ఎస్ 1, ఎంపీడీఓ ఐరాల 1, ఎంపీడీఓ ఎస్‌ఆర్ పురం 1, చిత్తూరు మున్సిపాలిటీ 1, విభిన్న ప్రతిభావంతుల శాఖ 1, ఎంపీడీఓ యాదమరి 1, ఎంపీడీఓ బంగారుపాళ్యం 1, ఎంపీడీఓ బైరెడ్డిపల్లి 1, సివిల్ సప్లైస్ శాఖ 2 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజా సమస్యలు ఇలా..


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

రెగ్యులర్ చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలి


ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరుతున్న ఏఎన్‌ఎంలు

జిల్లాలోని పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏఎన్‌ఎంలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2008లో ఉద్యోగాల్లో చేరిన తమకు ఇప్పటి వరకు వేతనాలు పెంచలేదని వాపోయారు. తమ తర్వాత సర్వీస్‌లో చేరిన వారికి వేతనాలు పెంచి, ఉద్యోగోన్నతులు కల్పించారన్నారు. దూరప్రాంతాలకు బదిలీ చేయడంతో చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తమను రెగ్యులర్ చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు, కుప్పం, పలమనేరు ప్రాంతాలకు చెందిన ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అమాయకులను జైల్లో పెట్టారు


న్యాయం చేయాలని కోరుతున్న మాపాక్షి షికారి కాలనీవాసులు

తమ వద్ద తుపాకులు ఉన్నాయని అన్యాయంగా జైల్లో పెట్టారని యాదమరి మండలం మాపాక్షి షికారి కాలనీ వాసులు రేఖ, సత్య, రజని తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ వారు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. షికారీలైన తమ వద్ద తుపాకులు ఉన్నాయని ఎస్‌ఐ తమ వారిని అరెస్టు చేసి జైలులో పెట్టారన్నారు. తుపాకులు తీసుకుని వచ్చి పోలీస్‌స్టేషన్‌లో సంతకం పెట్టాలని భయపెడుతున్నారని వాపోయారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

బాస్ స్కీంను కొనసాగించాలి


బాస్ స్కీంను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్న మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు

జిల్లావ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ (బాస్) స్కీంను ప్రభుత్వం కొనసాగించాలని మాలమహానాడు ఐక్య వేదిక జిల్లా సంయుక్త కార్యదర్శి ధనరాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాస్ స్కీం వల్ల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందేదని చెప్పారు. తాము హైకోర్టును ఆశ్రయించి తమ పిల్లలను చదివించుకుంటున్నామని, అయితే జిల్లాలోని కొన్ని యాజమాన్యాలు ఈ పథకాన్ని అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వాపోయారు.

ప్రార్థనలకు భంగం కలిగిస్తున్నారు


న్యాయం చేయాలని కోరుతున్న గౌసియా మసీదు నిర్వాహకులు, ముస్లింలు

చిత్తూరులోని దర్గా సర్కిల్ లాలూగార్డెన్‌లో ఉన్న గౌసియా మసీదులో ప్రార్థనలు చేసుకుంటున్న తమకు షేక్ ఆజాద్ అనే వ్యక్తి భంగం కలిగిస్తున్నారని మసీదు నిర్వాహకులు, ముస్లింలు వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మసీదు కమిటీకి ప్రతినిధి అంటూ ఆజాద్ పలువురిని మోసం చేస్తున్నట్లు వాపోయారు. ముస్లింలలో చీలిక తెచ్చి గొడవలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

తమిళ బియ్యం పట్టివేత

- 6 టన్నుల బియ్యం స్వాధీనం
- ఇద్దరిని అరెస్టు చేసిన తమిళ పోలీసులు

కుప్పంరూరల్: కర్ణాటకకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన తమిళనాడు రేషన్‌బియ్యాన్ని ఆ రాష్ట్ర పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా.. కుప్పం మండలం రాగిమానుమిట్ట గ్రామంలో అక్రమంగా తమిళనాడు రాష్ట్ర బియ్యం వ్యాపారం జరుగుతోందన్న పక్కా సమాచారంతో తిరుపత్తూరు పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఇందులో కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలించేందుకు అక్రమంగా నిల్వ ఉంచిన 6 టన్నుల బియ్యం, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే షబ్బీర్, నసీరుద్దీన్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గత రెండు నెలలుగా వీరు శాంతిపురానికి చెందిన మరో వ్యక్తితో కలిసి తమిళబియ్యం అక్రమ రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో తమిళనాడు పోలీసులు నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో పక్కా సమాచారంతో సోమవారం దాడులు నిర్వహించారు. నిందితులను తమిళనాడుకు తరలించారు.

పగ్గం తాడే యమపాశమై..!

- పాడి ఆవు మృతి • వీధిన పడిన కుటుంబం


మృతి చెందిన పాడి ఆవు

రొంపిచెర్ల: పగ్గం తాడే యమపాశమై ఓ పాడి ఆవు ఉసురు తీసింది. ఓ కుటుంబాన్ని తీరని దుఃఖాన్ని మిగిల్చింది. ఈ విషాద సంఘటన సోమవారం మండలంలోని అమ్మివారిపల్లె సమీప పొలాల్లో చోటుచేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన మహిళా రైతు గుర్రమ్మ పాడి ఆవు పోషణపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తోంది. రోజూ 7–8 లీటర్ల పాలు ఇచ్చే ఆవుపై ఆధారపడి గుర్రమ్మ కుటుంబం (మొత్తం ఐదుగురు) జీవిస్తోంది. ఈ నేపథ్యంలో పొలం వద్ద మేత మేయడానికి ఆవును కట్టేసి ఇంటికి వచ్చింది. ఆ తర్వాత మధ్యాహ్నం భోజనం చేసి పొలం వద్దకు వెళ్లే సరికి ఆవు విగతజీవిగా పడి ఉండటం చూసి నిశ్చేష్టురాలైంది. ఆవుకు కట్టి ఉంచిన పది మీటర్ల పొడవు ఉన్న పగ్గం తాడు కాలి గిట్టల మధ్య చిక్కుకుని మెడకు గట్టిగా బిగుసుకుపోవడంతో ఊపిరి ఆడక ఆవు మృతి చెందిందని గుర్తించారు. లక్ష రూపాయలు అప్పు చేసి ఆవును కొనుగోలు చేశామని, జీవనాధారం కోల్పోయామని గుర్రమ్మ కుటుంబం కన్నీటిపర్యంతమైంది. సమాచారం ఇవ్వడంతో పశువైద్యశాల సిబ్బంది వచ్చి ఆవు కళేబరాన్ని పరిశీలించారు. పగ్గం తాడు బిగుసుకుపోయి ఆవు మృతి చెందిన ఘటన ఇదే తొలిసారి కావడంతో చర్చనీయాంశమైంది. పలువురు అయ్యో అని సానుభూతి వ్యక్తం చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బంగారుపాళెం: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని టేకుమంద గ్రామానికి చెందిన వెంకటాచలం అక్రమంగా కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు. అతని వద్ద నుంచి 82(90ఎంఎల్) మద్యం టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629

DISTANCE EDUCATION

■ 10th Class / Intermediate (One Sitting), B.Com, B.Com (Comp.Sci), B.Sc, M.Sc, MBA, B.Tech (LE) Failed & Discontinued Students. 9494873721.

Real Estate

FLATS FOR SALE

■ లిమిటెడ్ ఫ్లాట్స్ కలవు. తిరుపతి-ఎస్.వి.అగ్రికల్చరల్ కాలేజ్ -పేరూరు గ్రామానికి సమీపమున RERA మరియు TUDA అప్రూవల్‌తో నిర్మించిన సిద్ధార్థ అవెన్యూ అపార్ట్‌మెంట్ నందు2 BHK (west)&3BHK(East)Flatsఅమ్మకానికి సిద్ధముగా ఉన్నవి. 9652430332, 9700801226

LEASE / RENT

■ K.R.Bhavan Hotel మరియు లాడ్జి 3 అంతస్థుల భవనము RTO చెక్ పోస్ట్ ఆఫీస్ దగ్గర, రేణిగుంట నందు అన్ని వసతులతో లీజుకు ఇవ్వబడును.సంప్ర: 9393467667.

PLOTS FOR SALE

■ 36 Months EMI Plots for sale Near Yerpedu IIT, IISER & IT Hub, Final Approved &Spot Registration. RKC Developers, ✆ 880 150 1376.

Wanted

■ Wanted Tele Callers / Marketing Officers/Team Leaders, Sal.Rs. 20,000 P.M+Incentives upto Rs.25,000, RKC Group, 8801501376, 8801502343.

■ ప్రభుత్వ పాఠశాలల్లోContractపద్ధతిన పనిచేయుటకు Attender (14,000), Computer Operator (18,000), Watch men(13,000)లుకావలెను.#9059019050.

■ శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ తిరుపతి, నాయుడుపేట, గూడూరు బ్రాంచ్‌లలో పని చేయుటకు బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 91777 01946, 99898 66088.

■ తిరుపతి హోమ్ కేర్ సర్వీసెస్, శ్రీమంతుల ఇళ్లలో పనిచేయుటకు పెద్దవారిని, పేషంట్లను చూచుకొనుటకు వర్కర్స్ 24/7 కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ:15000-18000 ☏8121555038, 8121555040

■ ప్రముఖ బ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీఅర్హత కల CSO,క్లర్క్,క్యాషియర్,బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను (M/F). ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో సంప్ర: Job Loc :ChithoorDistrict.Cell: 6281472105.

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663

■ కష్టమైనా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు. ఫ్రీ రూం+భోజనం. HYD. 7995884445

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ. పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తరఫున రోజూ క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కరణంవారిపల్లెలో హైనా ?


కరణంవారిపల్లె పొలాల్లో గుర్తించిన పాదముద్రలు


చౌడేపల్లె: మండలంలోని కాగతి పంచాయతీ కరణంవారిపల్లెలో చిరుత పులి సంచరించినట్లు ఓ మహిళ గ్రామస్తులకు తెలపడంతో భయభ్రాంతులకు గురైన ఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలో చిరుత, రెండు పిల్లలు కంచె దూకి వెళ్లినట్లు రెడ్డెమ్మ గ్రామస్తులకు తెలిపింది. దీంతో గ్రామస్తులు పొలాల్లో జంతువు పాదముద్రలను పరిశీలించి చిరుత పులి అడుగులే అంటూ పుకార్లు షికార్లు చేశారు. భయభ్రాంతులకు గురైన ప్రజలు విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలుపగా, ఎఫ్‌బీఓ యువరాజు, ఏబీఓ రామయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాదముద్రికలతో పాటు రాలిన వెంట్రుకలను గుర్తించారు. హైనా లేదా రేసు కుక్కలై ఉంటాయని తెలిపారు. గ్రామస్తులు పంట పొలాల్లోకి వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, పశువులను మేతలకు తీసుకెళ్లటప్పుడు గుంపుగా వెళ్లాలని సూచించారు.

భర్తను చంపిన భార్యకు జీవితఖైదు


నిందితురాలిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కట్టుకున్న భర్తను చంపిన కేసులో భార్యకు జీవిత ఖైదు విధిస్తూ చిత్తూరులోని 8వ అదనపు జిల్లా కోర్టు జడ్జి సుంకర శ్రీదేవి సోమవారం తీర్పునిచ్చారు. ఇన్‌చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులికల్లు రవీంద్రనాథ రెడ్డి కథనం మేరకు.. పాలసముద్రం మండలం నరసింహాపురానికి చెందిన మునివేలుకు 12 ఏళ్ల కిందట అదే గ్రామానికి చెందిన గోవిందమ్మ(30)తో వివాహమైంది. వారికి ఆరో తరగతి చదివే కొడుకు ఉన్నాడు. వీరు వ్యవసాయ కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవారు. అయితే గోవిందమ్మ ప్రవర్తనలో మార్పు రావడంతో పద్ధతి మార్చుకోవాలని మునివేలు పలుమార్లు హెచ్చరించాడు. పెద్దలు సర్ది చెప్పినా ఆమెలో మార్పు రాలేదు. తరచూ వారి మధ్య గొడవలు జరిగేవి. 2017 అక్టోబర్ 17వ తేదీన ఇంట్లో తన భర్త ఒక్కడే ఉండగా పుట్టింటి నుంచి వచ్చిన గోవిందమ్మ తినే అన్నంలో మత్తు మందు కలిపి మునివేలుకు వడ్డించింది. తరువాత నిద్రపోతున్న అతనిపై అర్ధరాత్రి సమయంలో కిరోసిన్ పోసి నిప్పంటించింది. మంటలతోనే బయటకు పరుగెత్తుతున్న భర్తను ఆమె కర్రతో కొట్టి అడ్డుకునే ప్రయత్నం చేయగా, తప్పించుకుని కాలువలో దూకి మంటలు ఆర్పుకున్న మునివేలు జరిగిన విషయాన్ని స్థానికులకు చెప్పాడు. అతన్ని తమిళనాడులోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ అదే నెల 25వ తేదీ చనిపోయాడు. మృతుడి తల్లి మల్లిక ఇచ్చిన ఫిర్యాదుపై పాలసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో గోవిందమ్మకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పునిచ్చారు.

శిలాఫలకం ధ్వంసం


బీజీ కండ్రిగ వద్ద ధ్వంసమైన శిలాఫలకం

నింద్ర : గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు సంబంధించిన వేసిన శిలా ఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన నింద్ర మండలంలో వెలుగు చూసింది. మండలంలోని బీజీ కండ్రిగలో గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం గమనించిన దీనిని గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం నీతిమాలిన చర్య అని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో 10 గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించారని, అందుకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు.

నేటి నుంచి గ్రామసభలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రీసర్వే పూర్తయిన అన్ని గ్రామాల్లో షెడ్యూల్ మేరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించే షెడ్యూల్ సిద్ధం చేసి క్షేత్రస్థాయి అధికారులకు పంపినట్లు చెప్పారు. ఆ మేరకు సంబంధిత గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామసభలు నిర్వహించాలన్నారు. ముందస్తుగా గ్రామాల్లో టామ్..టామ్ వేయించాలని తెలిపారు. సంబంధిత ఆర్ఎస్‌డీటీ, ఎంఎల్ఎస్‌ఓ, వీఆర్‌ఓ, సర్వేయర్లు కలిసి గ్రామసభలకు హాజరు కావాలని ఆదేశించారు. గ్రామసభల నిర్వహణ ఫొటోలు, వీడియోలు తీయాలన్నారు. సభలు జరిగే సమయంలో సంబంధిత రీసర్వే రికార్డులు, గ్రామ సభ రిజిస్టర్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

హైవే పక్కనే కిక్..

- జాతీయ రహదారి పక్కనే బ్రాందీషాపు ఏర్పాటు
- కుప్పంలో బరితెగించిన మద్యం దుకాణ యజమానులు
- పట్టించుకోని ఆబ్కారీ శాఖ అధికారులు
- ప్రమాదపుటంచున మద్యంప్రియుల మజా



జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన మద్యంషాపు

కుప్పం: రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన మద్యం పాలసీ మద్యంప్రియుల పాలిట ప్రాణసంకటాన్ని తెచ్చిపెడుతోంది. మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు నిబంధనలు నీళ్ల వదిలేసి ఎక్కడ పడితే అక్కడే షాపులు ఏర్పాటు చేశారు. కుప్పం మున్సిపాలిటీకి ప్రభుత్వం 5 మద్యం షాపులను మంజూరు చేసింది. వీటిలో పలమనేరు నుంచి కుప్పం మీదుగా తమిళనాడు రాష్ట్రం చెన్నై-బెంగళూరు హైవేకు అనుసంధానంగా ఉన్న 42 జాతీయ రహదారి పక్కనే మద్యం షాపు ప్రారంభించారు. కుప్పం పట్టణంలో కృష్ణగిరి సర్కిల్‌లో దుకాణం అడ్రస్ చూపుతూ, చప్పిడిగరులు వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాతీయ రహదారికి 500 మీటర్లు దూరం వరకు మద్యంషాపులు ఏర్పాటు చేయకూడదు. కానీ కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పెట్టాల్సిన వైన్ షాపును చప్పిడిగరుగుల వద్ద రోడ్డుకు ఆనుకుని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఈ మద్యం దుకాణం వద్దే రంగనాయకులు స్వామి ఆలయం ఉండడంతో భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రస్తుతం ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద గతంలో మూడుదఫాలు భారీ రోడ్డు ప్రమాదాలు, అలాగే ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. జాతీయ రహదారి కావడంతో ఆంధ్ర నుంచి తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు కంటైనర్ వంటి భారీ వాహనాలు వెళ్తుంటాయి. ఈ రోడ్డు పక్కనే మద్యంషాపు ఉండడం వల్ల మందుబాబులు మత్తులో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

కొందరికే జరిమానా..!

- లద్దిగం చెరువులో ఐదు హిటాచీలు, ఒక టిప్పర్ సీజ్
- రూ.6.19 లక్షల జరిమానా విధింపు
- 2 హిటాచీలు, రెండు ట్రాక్టర్లకు ఫైన్ ఎందుకు వేయనట్లు ?
- అధికార పార్టీ నేతల పట్ల స్వామిభక్తి చాటుకుంటున్న యంత్రాంగం
- చెరువులో గోతులను పరిశీలించిన తహసీల్దార్
- ఘటనపై ఆరా తీసిన జిల్లా కలెక్టర్


లద్దిగం చెరువులో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతు నాయక్

పుంగనూరు: కాని వారికి జరిమానా.. అధికార పార్టీ నేతలకు మాత్రం మినహాయింపు ఇస్తూ అధికారులు స్వామి భక్తి చాటుకుంటున్నారు. అందుకు లద్దిగం పెద్ద చెరువులో జరిగిన సంఘటనే ఉదాహరణగా నిలుస్తోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ హనుమంతు నాయక్ రైతులతో కలిసి సోమవారం చెరువులో తవ్వకాలను పరిశీలించారు. అలాగే ఇసుక అక్రమ రవాణా ఘటనపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సైతం ఆరా తీశారు. తెలుగు తమ్ముళ్ల అండతో ఇసుకను తవ్వేస్తున్న ఐదు హిటాచీలు, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఒక్కో వాహనానికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించామని, ఆరు వాహనాలకు రూ:6,19,999 చెల్లించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా సుమారు వంద అడుగుల మేర చెరువులో మట్టిని తవ్వి కుప్పగా వేసిన ప్రదేశాలను చదును చేసి ఇవ్వాలని రైతులు అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వాహనాలకు జరిమానా చెల్లించిన అనంతరం చెరువులో గుంతలు పూడ్చే పనులు ప్రారంభిస్తామన్నారు. వాహనాలు చెరువులోనే ఉన్నాయని అక్కడ పోలీసులు సిబ్బందితోపాటు వీఆర్‌ఏలను కాపలాగా పెట్టామన్నారు. ఆయన వెంట వీఆర్వో బాలాజి, రైతులు తదితరులు ఉన్నారు.

ఆ వాహనాలకు ఫైన్ ఎందుకు వేయలేదో !

లద్దిగం చెరువులో అక్రమంగా ఇసుక తోడేందుకు వినియోగించిన ఏడు హిటాచీలను, ఒక టిప్పర్‌ను రైతులు పట్టుకుని అధికారులకు అప్పగించారు. అయితే తహసీల్దార్ ఐదు హిటాచీలకు, ఒక టిప్పర్‌కు మాత్రమే జరిమానా విధించారు. మిగిలిన రెండు హిటాచీలకు ఎందుకు ఫైన్ వేయలేదు సార్ అని రైతులు నిలదీస్తున్నారు. కాగా అధికార పార్టీ నాయకుడికి చెందినవి కావడం వల్లే రెండు హిటాచీలకు జరిమానా విధించలేదు. దీనిపై ఇసుక వ్యాపారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెరువు నీటిని తోడేస్తున్న రెండు ట్రాక్టర్లకు జరిమానా ఎందుకు విధించడం లేదంటూ రైతులు నిలదీశారు.

క్రిమినల్ కేసు ఎందుకు కట్టలేదు ?

లద్దిగం చెరువులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నెల్లూరు వ్యాపారి ప్రసాద్‌రెడ్డి, అతని సిబ్బందిపై పోలీసులు క్రిమినల్ కేసు ఎందుకు కట్టలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. యంత్రాలతో ఇసుకను తరలించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పదేపదే అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ అధికార పార్టీ నేతల పట్ల అధికారులు, పోలీసులు స్వామిభక్తిని చాటుకుంటున్నారనడానికి ఇదే నిదర్శనం అని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.